

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

# కలెక్టరేట్‌లో మహాత్మకి ఘన నివాళులు



**నెల్లూరు,జనవరి30,ప్రభాతవార్త-కలెక్టరేట్** సత్యం, దర్మం, అహింస, సత్యాగ్రహం వంటి ఆయుధాలతో భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిన మహాత్ముడు గాంధీజీ అని, ఆయన చూపిన శాంతిమార్గంలో మనమందరం నడవాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ కె. కార్తీక్అన్నారు. గురువారం ఉదయం మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ యావత్ భారతావనికి స్వేచ్ఛావాయువులు ప్రసాదించిన జాతి మార్గదర్శకుడు గాంధీజీ అని అన్నారు. ప్రతి ఒక్కరూ మన జాతిపిత అనుసరించిన మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని సన్మార్గంలో పయనించాలని ఇన్చార్జి కలెక్టర్ పిలుపునిచ్చారు. డిఆర్వో జె. ఉదయభాస్కర్ రావు, కలెక్టరేట్ ఎవో విజయ్ కుమార్, డిడి ఐఅండ్‌పిఆర్ సదారావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## జడ్పిలో మహాత్మకు ఘన నివాళులు



**నెల్లూరు, జనవరి 30, ప్రభాతవార్త - కలెక్టరేట్** జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా జడ్‌పి చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా ప్రజా పరిషత్ సిఈవో విద్యారమతో కలిసి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీజీ 77వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రబాబు ప్రభుత్వానికి గుదిబండలా మారిన జగన్ అప్పులు : ఎమ్మెల్యే



**కావలి, జనవరి30 ప్రభాతవార్త** వైసిపినేత జగన్‌రెడ్డి చేసిన అప్పులు చంద్రబాబు ప్రభుత్వానికి గుదిబండలా మారాయని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి విమర్శించారు. గురువారం ఆయన కావలి టిడిపి కార్యాలయంలో మాట్లాడారు. గడిచిన 7 నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయంబర్స్‌మెంట్‌లాంటి జగన్ ప్రభుత్వబకాయిలు 22వేలకోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఏడాదికి 71వేలకోట్లు అసలు, వడ్డీ చెల్లించాలని ఇవి చంద్రబాబు ప్రభుత్వానికి గుదిబండలా మారాయన్నారు. జగన్ ప్రభుత్వం 1.40 లక్షల కోట్లు ఉన్నాయని ఈ స్థాయిలో గత ఏ ప్రభుత్వం బకాయి పెట్టలేదన్నారు. తెచ్చిన అప్పులు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణం వాటిపైకాకుండా విలాసాలు, జల్సాలకు ఖర్చుచేసి తినేశారని ఎమ్మెల్యే దగుమాటి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జగన్ విలాసాలకు, జల్సాలకు ప్రభుత్వధనం దాదాపు 19,871,35 కోట్ల రూపాయలు దుబారా చేశారని తెలిపారు. ఐదుయేళ్లలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగన్‌రెడ్డి 8లక్షలకోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారన్నారు. భూకేటాయింపులు, గనుల త్రవ్వకాలు, సోలార్‌కు అనుమతులు ఇలా ప్రతిదాంట్లో ఆశ్రితపక్షపాతానికి ఒడిగట్టి లక్షలకోట్లు జగన్‌రెడ్డి సంపాదించారని దుయ్యబట్టారు. ప్రతిదాంట్లో చేతివాటం చూపించారన్నారు. వీటన్నింటితో ఆంధ్రప్రదేశ్ ఆర్థికవ్యవస్థ దివాళాతీసిందన్నారు. ప్రజలపాలిట శాపంగా మారిందన్నారు. దీంతో టిడిపి ప్రభుత్వ ఆదాయానికి తీవ్రగండిపడిందన్నారు. అయినా, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు.

## బాపూజీ చిత్రపటానికి నివాళులు అర్పించిన కాకాణి, పర్వత రెడ్డి



**నెల్లూరు రూరల్, జనవరి 30, ప్రభాతవార్త** మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా నెల్లూరు వైసిపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కాకాణిగోవర్ధన్‌రెడ్డి, నగర ఇంచార్జి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఆనం విజయ కుమార్ రెడ్డి, ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లతో కలిసి మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీజీ వర్ధంతి సందర్భంగా అందరితో కలిసి మహాత్మ గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి ఆ మహనీయుడు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. మహాత్మా గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం దిశగా గాంధీజీ ఆశయ సాదన కోసం వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ పాటుపడుతుందని వారు తెలిపారు.

## పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

### నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించిన ఎస్పి



**నెల్లూరుక్రైం,జనవరి 30, ప్రభాతవార్త** పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పి కృష్ణకాంత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌నకు విచ్చేసిన జిల్లా పోలీసు అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పి నెలవారీ నేర సమీక్షా సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చోటు చేసుకున్న గ్రేవ్, నాన్ గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాలలో రికవరీల గురించి సర్కిల్ వారీగా అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులు పట్ల ఆలసత్వం ప్రదర్శించరాదని తెలిపారు. ప్రజలకు సిసి టివి కెమెరాల ప్రాముఖ్యత వివరించి, అవగాహన కల్పించి, అన్ని గ్రామాలు, మారుమూల ప్రాంతాలు, శివారు ప్రాంతాలలో, షాప్‌లు, పట్టణాలు, కూడళ్ళు, అపార్ట్మెంట్‌లలో తప్పక ఏర్పాటు చేసుకునేలా చూడాలని సూచించారు. మార్చి 8న జరగనున్న జాతీయ మెగా లోక్ అధాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ బృందాన్ని సమన్వయం చేసుకుంటూ గంజా అమ్మేవారు, సేవించే వారిపై నిఘా పెట్టి, నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ క్రైమ్స్ వలన జరిగే నేరాలు పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, మిస్సింగ్ కేసులను ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వెంటనే చేధించాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామ సందర్శనలు, పల్లె నిద్ర కార్యక్రమలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పిజిఆర్‌ఎస్ పిటిషన్లను తక్షణమే పరిష్కరించాలని, డయల్ 112 కాల్స్‌కు వెంకటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకోవాలని స్పష్టం చేశారు. రాత్రి పూట అన్ని స్టేషన్లలలో గస్తీలు ముమ్మరం చేయాలని, అనుమానితుల వేలముద్రలు సేకరించాలని సూచనలిచ్చారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ సూచిక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టండి. నాన్ బైలబుల్ వారెంట్ కేసులలో, జైలు శిక్ష అనుభవించి మద్యలో పెరోల్ పైన బయటకు వచ్చిన ముద్దాయిలను గుర్తించి వారిని తిరిగి కోర్టుకు అప్పగించడంలో ఆలస్యం చేయవద్దని సూచించారు. అనుమానితులు, పాతనేరస్తులపై నిఘా ఉంచి, వారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని అనుమానం వస్తే బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, హత్య కేసులు, పిఓసిఎస్‌ఓ అండ్ రేప్ కేసులు, డెకాయిటి, రాబరీ, ప్రావర్టీ, వాహనాలు దొంగతనం, మిస్సింగ్, చీటింగ్ కేసులు, ప్రావర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 సిఆర్‌పిసి కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్, డిపిఒకు సంబంధించి పెండింగ్ రిప్లై ఫైల్స్ పెండింగ్ ఎన్‌బిడబ్ల్యు ఎస్, ఎన్‌డిపిఎస్ కేసులలో దర్యాప్తు రికవరీలు గురించి సర్కిల్ వారీగా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎస్పితో పాటు అడిషనల్ ఎస్పి అడ్మిన్, సిహెచ్ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి,ఎస్‌బి టౌన్, రూరల్, ఏఓ,సిఐలు,ఎస్‌ఐలు పాల్గొన్నారు.



## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జనవరి30 ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం సాయంత్రానికి 1840 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 67.286టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్‌ఎఫ్‌సికి 350, ఎన్‌ఎఫ్‌సికి 650, పెన్నా డెల్టాకు 2750, కండలేరు వరద కాలువకు200 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.112 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# రీసర్వే భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించండి

కలెక్టరేట్‌లకు 95 శాతం అర్జీలు భూ సమస్యలపైనే వస్తున్నాయి
ప్రతి భూ సమస్యకు సంతృప్తికర పరిష్కారం చూపాలి
ఫిబ్రవరి 15లోగా నడికుడి
శ్రీకాళహస్తి రైల్వే లైను భూసేకరణ వివరాలు అందించాలి



**నెల్లూరు, జనవరి 30, ప్రభాతవార్త - కలెక్టరేట్** భూముల రీసర్వే రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన పలురకాల భూ సమస్యలను సంతృప్తికర స్థాయిలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నెల్లూరు, ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు సర్వేయర్లతో జేసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ రీ సర్వే గ్రామ సభల్లో వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ఎఫ్ లైన్ సర్వే పట్టా సబ్ డివిజన్ దరఖాస్తులు పెండింగ్ ఉండకూడదన్నారు. ప్రతి రోజూ కూడా రెవెన్యూ డివిజనల్ అధికారులు మండల స్థాయిలో పెండింగ్ అంశాలపై సమీక్ష చేయాలన్నారు. ప్రతి వారం మంగళ, బుధవారాల్లో ఎపోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్, తహశీల్దారు ప్రజలకు అందుబాటులో ఉండి క్షేత్రస్థాయిలో సివిల్ భూ సమస్యల పరిష్కారం పై దృష్టి పెట్టి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన రీ సర్వే గ్రామాల్లో విలేజ్ బౌండరీ, గ్రౌండ్ ట్రూతింగ్, భూ విస్తీర్ణం, జాయింట్ ఎల్‌పిఎం సబ్ డివిజన్ మొదలైన రెవెన్యూ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో సాంకేతికంగా ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఫిబ్రవరి 15లోగా నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైను భూసేకరణ, నష్టపరిహారం వివరాలు కలెక్టరేట్‌కు అందించాలని రాపూరు, పొదలకూరు మండలాల తహశీల్దార్లకు జేసి సూచించారు. రెవెన్యూ అధికారులందరూ భాధ్యతాయుతంగా పనిచేసి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ ఉదయ భాస్కర్‌రావు, జిల్లా భూ సర్వే రికార్డుల ఎడి వై. నాగేశ్వర్, కావలి ఆర్డీవో వంశీకృష్ణ, ఆత్మకూరు ఆర్డీవో పావని, తహశీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్లను ఆదర్శంగా నిర్వహించండి: కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్,జనవరి 30, ప్రభాతవార్త:** ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని కావలి, ఆత్మకూరు, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి, కందుకూరు మున్సిపాలిటీల పరిధిలోని అన్న క్యాంటీన్లను ఆదర్శంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్లకు నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, అన్న క్యాంటీన్ల స్పెషల్ అధికారులు, క్యాంటీన్ల నిర్వాహకులతో సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించి నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ లను ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో పాత మున్సిపల్ ఆఫీస్, తడికల బజార్ కూడలి, ఇందిరా భవన్ రోడ్డు, ఫిష్ మార్కెట్, వెంగళరావు నగర్, మద్రాసు బస్టాండ్, రామలింగాపురం కూడలి ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి ప్రజలకు మూడు పూటలా ఆహారాన్ని సరియైన సమయమునకు అందిస్తున్నామని తెలియజేశారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 7 అన్న క్యాంటీన్లను నిరంతరం పర్యవేక్షిస్తూ వాటి నిర్వహణ తీరును ఇంకా మెరుగుపరిచి, ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా తీర్చిదిద్దాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అన్న క్యాంటీన్లలో క్వాలిటీ, క్వాంటిటీలను మెరుగుపరిచి, ఆహారంలో రుచి శుచి ఉండేలా అధికారులు, సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అన్నా క్యాంటీన్ల నిర్వాహకులు ప్రతీ క్యాంటీన్ లో తప్పనిసరిగా 7 మంది సిబ్బంది ఉండేలా చూసుకోవాలని, ఒక వాచ్మెన్, ఒక టోకన్లు ఇచ్చే వ్యక్తి, ముగ్గురు సప్లయర్స్, క్లీనింగ్ చేయడానికి మరో ఇద్దరు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆహారం తయారీ ప్రాంతం నుంచి క్యాంటీన్ లకు సరఫరా చేసేందుకు, క్యాంటీన్లో ప్రజలకు వడ్డించేందుకు అవసరమైన మేరకు సిబ్బందిని పెంచుకోవడంతో పాటు తోపులాటలు జరగకుండా సెక్యూరిటీ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. సిబ్బంది హాజరు పట్టిక, విజిటర్స్ హాజరు పట్టిక, ఫిర్యాదుల పట్టికలను ప్రతి క్యాంటీన్లో ఏర్పాటు చేయాలని, అదేవిధంగా అన్ని క్యాంటీన్లలో సీ.సీ. కెమెరాలను ఏర్పాటు చేసియున్న కమాండ్ కంట్రోల్ విభాగం ద్వారా పర్యవేక్షించాలని స్పెషల్ ఆఫీసర్లను ఆదేశించారు. ప్రతి క్యాంటీన్లో స్వచ్ఛమైన తాగునీరు కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, ఎప్పటికప్పుడు ఆహారపు ప్లేట్లను వేడి నీటితో శుభ్రపరచడం, అందుకోసం వాటర్ హీటర్ ఏర్పాటు, ప్లేట్లు కడిగే ప్రాంతంలో ప్లాట్ఫారం ఏర్పాటు, రూఫ్ ఏర్పాటు, మురుగు నీరు పోవడానికి ఏర్పాటు తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు.

**ఆహారం అందించే వేళలను పెంచండి** ఆహారం అందించే వేళలను రద్దీ మేరకు పెంచడం, ఎక్కువ ఆహారం అవసరమైన క్యాంటీన్ కు ఎక్కువ మొత్తంలో సరఫరా చేయడం వంటి అంశాలపై దృష్టి సారించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయం కలిగినప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవడం, క్యాంటీన్ నిర్వహణపై ప్రజల నుంచి ప్రతి రోజూ అభిప్రాయాలు సేకరించడం, సేకరించిన అభిప్రాయాలను ఉన్నతాధికారులకు చేరవేయడం, అభిప్రాయాల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. క్యాంటీన్ల ప్రాంగణంలో పూల మొక్కలను పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. పోలీసు విభాగం వారి సహకారంతో అవసరమైన క్యాంటీన్లలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని సూచించారు. అన్న క్యాంటీన్ల నిర్వహణకు సంబంధించిన ఏ ఒక్క అంశాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఏవైనా సమస్యలు ఉంటే తప్పనిసరిగా తమ దృష్టికి తీసుకురావాలని కమిషనర్ ఆదేశించారు.

**నిరాశ్రయులకు మూడు పూటల అన్న** పాత మున్సిపల్ కార్యాలయంలోని నిరాశ్రయులు మూడు పూటల అన్న క్యాంటీన్ల కు వచ్చి ఆహారాన్ని స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. అదేవిధంగా మున్సిపాలిటీల పరిధిలో కూడా అర్బన్ హోమ్ లెస్ పీపుల్ సెంటర్లను ఏర్పాటు చేసి నిరాశ్రయులకు మూడు పూటల ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమీషనర్ నందన్, స్పెషల్ అధికారులు చెన్నుడు, కావలి,ఆత్మకూరు,గూడూరు,నాయుడుపేట,సూళ్లూరుపేట,వెంకటగిరి, కమిషనర్లు , వేణు , రహంతా జానీ, శేషగిరి రావు, క్యాంటీన్ ల నిర్వాహకులు గణేష్, అనిల్, సాయి, నిఖిల్ పాల్గొన్నారు

# నగర, రూరల్, కార్పొరేటర్లతో వైసిపి నాయకుల సమావేశం



**నెల్లూరు రూరల్, జనవరి 30, ప్రభాతవార్త** నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల డివిజన్ కార్పొరేటర్లతో కాకాణి గోవర్ధన్ రెడ్డి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్చార్జి ఆనం విజయ కుమార్ రెడ్డి, ఖలీల్ అహ్మద్‌తో కలిసి పాల్గొన్నారు. వైసిపి నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జి ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు రాంజీ నగర నియోజకవర్గ కార్యాలయంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్చార్జి ఆనం విజయ కుమార్ రెడ్డితో కలిసి వైసిపి నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జి, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఫిబ్రవరి 3న జరగబోయే డిప్యూటీ మేయర్ ఎన్నిక కార్యక్రమంలో వ్యవహరించాల్సిన తీరుపై నేతలతో కాకాణి గోవర్ధన్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లతో చర్చించారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అభిప్రయానికి అనుగుణంగా కార్పొరేటర్లు అందరూ నడుచుకోవాలని సూచించారు. అనంతరం ఆనం విజయకుమార్ రెడ్డి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లతో కలిసి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి మీడియా సమావేశంలో నిర్వహించారు. డిప్యూటీ మేయర్ ఎన్నికకు, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ పై గెలిచిన తెలుగుదేశం పార్టీ భీఫామ్ ఇచ్చి ఎన్నిక బరిలో నిలపడం విడ్డూరంగా ఉన్నారు. ఇలాంటి చర్యలు మూలంగా తెలుగుదేశం పార్టీ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తుందని వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పార్టీ భీఫామ్ ఇచ్చి డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహిస్తే మాత్రం దానిపై ఖచ్చితంగా న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

# పోరాటాల పురిటిగడ్డ సింహపురిలో సిపిఎం రాష్ట్ర మహాసభలు

-రాష్ట్ర సభల్లో పాల్గొననున్న అతిరధ మహారధులు
-ప్రత్యామ్నాయ రాజకీయ విధానాన్ని రూపొందిస్తాం
కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేఖ విధానాలపై పోరు బాట
-మీడియాపై అనుచిత వాఖ్యలు చేసిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి
-సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు వెల్లడి



**నెల్లూరు,జనవరి30 ప్రభాతవార్త-విద్య** పోరాటాల పురిటిగడ్డ సింహపురిలో ఫిబ్రవరి 1వ తేదీ నుండి మూడురోజుల పాటూ తమ పార్టీ 27వ రాష్ట్రమహాసభలను ఘనంగా నిర్వహించనున్నామని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం నగరంలోని స్థానిక జెట్టిశేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో గుర్తింపును సాధించిన అనేక ఉద్యమాలు సింహపురిలో పరుడుపోసుకోవటం జరిగిందని గుర్తు చేశారు. దక్షిణ బాతర కమ్యూనిష్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య, జెక్కా వెంకయ్యల లాంటి ఉత్తముల పుట్టిన గడ్డపై ప్రతిష్టాత్మకంగా ఈ మహా సభలను నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేయటం జరిగిందన్నారు. తమ పార్టీ కేంద్ర కమిటీ పరిశీలకులు ఎంఎ బేబీ,బివి.రాఘవులు, అరుణ్ కుమార్ ల వంటి అతిరధ మహారధుల సారధ్యంలో దేశంతోపాటూ రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థ ఏర్పాటు అంశాలై చర్చించనున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని ఐదు ప్రధానమైన ప్రజా మస్యలను దృష్టిలో ఉంచుకుని ఐదు ర్యాలీలను రాష్ట్రంలో నిర్వహిస్తునామన్నారు. ఈ ఐదు జ్యోతుల రాష్ట్ర పర్యటనను పూర్తిచేసుకుని 31వ తేదీ రాత్రి నెల్లూరుకు చేరుకుంటాయని వాటిని స్వీకరించి రాష్ట్ర మహాసబలను ప్రారంబిస్తామన్నారు. అలాగే రాజకీయాల్లో మహిళలు, యువత పాత్రను పెంచేలా అన్నీ చర్యలు తీసుకోవాలన్నారు. తమ పార్టీ ఆవిర్భవించిన నాటి నుండి అనేక పోరాటాలు సాగించి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా విజయాలు సాధించటం జరిగిందన్నారు. రాష్ట్రంతోపాటూ జిల్లాల్లోని కార్మిక, కర్షక, రైతు, పోరాట ఉద్యమాలను కొనసాగిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ చర్యలను ఎప్పటి కప్పుడు ఎండ గడుతూ పోరుబాట చేపట్టనున్నామని తెలిపారు. పార్టీని బలోపేతం చేయటం, ప్రజలకు దగ్గర చేయటం వంటి ముఖ్యమైన అంశాలను చర్చిస్తామని, మహాసభల చివరి రోజు నగరంలోని స్థానిక ఆత్మకూరు బస్టాండు నుండి భారీ సంఖ్యలో ఎర్ర దుస్తులు దరించిన తమ పార్టీ నాయకులు , కార్యకర్తల ఆధ్వర్యంలో భారీ ర్యాలీని నిర్వహించి విఆర్‌సి వరకు చేరుకుంటామని, విఆర్‌సి మైదానంలో భారీ బహిరంగ సభను ఏర్పాటుచేయనున్నామన్నారు. ఈ మహాసబల్లో పాల్గొనేందుకు వచ్చేవారికి ఎటువంటి అసౌకార్యాలు కలుగకుండా అన్నీ చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. ప్రజా స్వామ్యాన్ని అపహాసం చేసే విధంగా తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే మీడియాపైచేసిన వాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే అతినై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అందరూ పాల్గొని ఈ మహాసభలను విజయవంతం చెయ్యాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి, జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహనావు, మాజీ కార్యదర్శి చంద్ర రాజగోపాల్, నాయకులు అజయ్‌కుమార్, మాదాల వెంకటేశ్వర్లు , నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, బిపీ నరసింహ, షేక్.రహీనా బేగం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్‌బోర్డుకు చెందాల్సిన రూ.50కోట్లు ఇప్పించండి

**నెల్లూరు, జనవరి 30, ప్రభాతవార్త -వైద్యం** తెలంగాణ వక్ఫ్‌బోర్డు నుంచి ఏపీ వక్ఫ్‌బోర్డు కు రావాల్సిన రూ.50కోట్ల పెండింగ్ బకాయిలను ఇప్పించాలని ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ కోరారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ గురువారం కలిసి పలు సమస్యల గురించి వివరించారు. ఈ సంధ్బంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్ర రాష్ట్ర వక్ఫ్‌బోర్డుకు చెందిన అన్ని రికార్డులు(డిజిటల్ రికార్డులతో సహా) పత్రాలు తెలంగాణ నుంచి బదిలీ చయలేదని, ఆస్తులను అప్పగించలేదని తెలిపారు. చాలా వ్యాజ్యాలు/ కోర్టు కేసులకు ఆ ఫైల్‌ల నుండి మెటీరియల్ అవసరమని పేర్కొన్నారు. ఏపీ వక్ఫ్‌బోర్డు వద్ద రికార్డులు లేని కారణంగా చట్టపరమైన విషయాలలో కౌంటర్లు దాఖలు చేయలేకపోతున్నామని తెలిపారు. త్వరితగతిన ఏపీ వక్ఫ్‌బోర్డుకు చెందిన రికార్డులు అందేలా చేయాలని కోరారు. ఆదాయం లేని 1500 మసీదుల పెండింగ్ దరఖాస్తులను, మసీదులు, కాంపౌండ్ గోడలు గ్రేవ్ యార్డులు, ఈద్గాలు, అషూర్ ఖానాలు, దర్గాలు మొదలైన వాటి నిర్మాణం, మరమ్మత్తుల కోసం 2024-25 సంవత్సరానికి గాను 10.00 కోట్లు వక్ఫ్‌ఆస్తులను ఆక్రమణల నుంచి రక్షించడానికి సరైన చర్యలు తీసుకోవడానికి అలాగే ఆస్తులకు ఫెన్సింగ్, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు తదితర చర్యలకు రూ.50.00 కోట్లు, హైకోర్టు, ఏపీ వక్ఫ్‌ట్రిబ్యునల్ అపెక్స్ కోర్టు మొదలైన కేసులను వాదించడానికి చట్టపరమైన ఖర్చుల ఖర్చు కోసం 5 కోట్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఏపీ ఆన్‌లైన్ వారికి ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలను చెల్లించాలని కోరారు. 2014లో నెల్లూరులోని బారా షహీద్ దర్గా ప్రాంగణంలో రొట్టెల పండుగ- ఇస్లామిక్ కన్వెన్షన్ సెంటర్ అభివృద్ధి, ఇతర అనుబంద అభివృద్ధి కోసం 20 కోట్లు విడుదల చేశారని, దానిని జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని తెలిపారు.

2024లో రొట్టెల పండుగకు సంబంధించి నెల్లూరులోని బారా షహీద్ దర్గా అభివృద్ధికి సంబంధించి ప్రకటించిన 5 కోట్లు విడుదల చేయాలని కోరారు. ఈ విషయాలలో తమ జోక్యం, తీసుకునే చర్యలు రాష్ట్ర వక్ఫ్‌బోర్డులో తన బాధ్యతలను మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు తద్వారా సమాజ సంక్షేమానికి దోహదపడటంలో గొప్పగా సహాయపడుతుందని తెలిపారు.



## సమావేశాలకు హాజరు తప్పనిసరి



**కోవూరు,జనవరి 30 పభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే విద్యాకమిటీ సమావేశాలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలని అమరావతి నుంచి మధ్యాహ్న భోజన పరిశీలనకు వచ్చిన ఎస్‌జేఎం ఎం. కోనయ్య తెలిపారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న ఎంటీవీడీఎం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం పాఠశాల విద్యాకమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి సమావేశాలకు తల్లిగానీ, తండ్రిగానీ ఎవరో ఒకరు హాజరైతే తమ బిడ్డ పాఠశాలలో ఏ విధంగా చదువుతున్నాడు.. బోధన ఎలా ఉంది.. ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయా.. వాటికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ప్రధానోపాధ్యాయులతో నేరుగా ప్రశ్నించే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం తీరుతెన్నులు కూడా వారు ఎప్పుడైనా వచ్చి పరిశీలన చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి,విజయవాడ నుంచి వచ్చిన సోషల్ ఆడిట్ బృందం డీఆర్‌పీలు వి. కృష్ణప్ప, టి. చెన్నకేశవులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## విద్యార్థులకు మంచి విద్యనందిస్తున్న శ్రీచైతన్య జూనియర్ కళాశాల



**కావలిరూరల్, జనవరి30 ప్రభాతవార్త :** విద్యార్థులపట్ల వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని మంచి విద్య నందిస్తూ వారికి బంగారుబాటలు వేస్తున్న కళాశాల కావలి శ్రీచైతన్య జూనియర్ కళాశాల అని కావలి శాశనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలియచేశారు. కావలి పాతవూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల 23వ వార్షికో త్సవం గురువారం స్థానిక దొడ్ల మనోహర్‌రెడ్డి నారాయణ కళ్యాణమండపంనందు కళాశాల కరస్పాండెంట్ ఎస్ వెంకయ్య, ప్రిన్సిపాల్ టివి లుకోధర్‌ల అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్య క్రమానికి విశిష్ట అతిధిగా ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, ముఖ్య అతిధిగా శ్రీచైతన్య డిగ్రీకళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బెజవాడ రవికుమార్‌లు పాల్గొనడం జరిగింది. వీరిని కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ప్రత్యేక అతిధులుగా జబర్‌దస్త్ టీమ్ వినోదిని, అప్పారావు, నవీన్‌లు పాల్గొని విద్యార్థులను అలరించడం జరిగింది. అనంతరం వీరిని కూడా సత్కరించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి చేతులమీదుగా నగదు బహుమతులు అందచేయడం జరిగింది. ప్రిన్సిపాల్ ఆర్‌ఎస్ రమేష్‌మూర్తి జ్ఞాపకార్థం జూనియర్ బైపిసి 435/440 మార్కులు సాధించిన జి.ధనుష్క టాపర్‌కు మాజీ శాశనసభ్యులు జక్కా వెంకయ్య జ్ఞాపకార్థం, సీనియర్ బైపిసి నందు 434/440 మర్కులు సాధించిన పి.కృష్ణసౌజన్యకు ఒక్కొక్కరికి 5వేల రూపాయలు అందచేయడం జరిగింది. డాక్టర్ బెజవాడ రవికుమార్ బైపిసి నందు 431 మార్కులు సాధించిన జి. బాలాజీకి 2వేల రూపాయలు అందచేయడం జరిగింది. కళాశాల కరస్పాండెంట్ ఎస్ వెంకయ్య, జూనియర్ ఎంపిసిలో 465 మార్కులు సాధించిన పి.జశ్వంత్ టాపర్‌కు 5వేల రూపాయలు అందచేయడం జరిగింది. కళాశాల డైరక్టర్ ఎం కొండయ్య సిఈసి గ్రూప్‌నందు 435 మార్కులు సాధించిన ఎన్ రజితకు, ఎంపిసి గ్రూప్ ఎన్‌జెస్సినందు 424 మార్కులు సాధించిన సిహెచ్ భవ్యకు ఒక్కొక్కరికి 2వేల రూపాయలు అందచేయడం జరిగింది. జాతీయస్థాయిలో హేమర్‌త్రోలో గెలిచిన ఎం.నవదీప్, టేబుల్‌టెన్నిస్ స్టేట్ ప్లేయర్ రెడ్డికి జిల్లా ప్లేయర్స్ 9 మందికి కళాశాల తరపున బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ సదర్భంగా ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు ఇంటర్మీడియట్ దశ ఎంతో కీలకమైనదని ఈ దశలోనే విద్యార్థుల దశ మారుతుందని, చెడిపోవాలన్నా, బాగుపడాలన్నా ఈ దశలోనే అని తెలియ చేశారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, కష్టాన్ని ఇష్టంగా స్వీకరించి చదవాలని అలా చదివినట్లయితే రాబోవు రోజుల్లో సుఖపడతారని తెలియచేశారు. మిమ్మల్ని మీ తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని చదివిస్తున్నారని ఆ ఆశలను నెరవేర్చవలసిన బాధ్యత మీ పై ఉందని, మీ తల్లింద్రండులకు, మీరు చదువుకుంటున్న కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని తెలియచేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శిం చిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరక్టర్లు పివియస్ ప్రసాద్, ఎం కొండయ్య, పి జానకిరామ్, ప్రకాశం శివరామిరెడ్డి, ఎన్ సత్యప్రసాద్, వి మల్లికార్జున, గౌరవ సలహాదారులు నందనవనం మధుసూధనరావు, పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి అలేఖ్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా చేజర్లలలో మహాత్మాగాంధీ వర్ధంతి



**చేజర్ల జనవరి 30 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన చేజర్ల బస్టాండ్ సెంటర్‌లో మహా త్మాగాంధీ వర్ధంతి సందర్బంగా గాంధీజి విగ్ర హానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా గురువా రం నివాళు లర్పించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మండల తెలుగుదేశం నాయకులు రావి పెంచలరెడ్డి, రావి లక్ష్మీనర సారెడ్డి, హాజరై పూలమాలలు వేసి నివాళులర్పి ంచారు.అనంతరం గాంధీజిని స్మరించుకుంటు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు దేవతి సుబ్బారావు, పువ్వాడి శ్రీనివాసులు,సుధాకర్, కృష్ణ తదితరులు పాల్గోన్నారు.

## సిసి రోడ్లు తనీఖీ చేసిని పంచాయితీరాజ్ ఇఇ



**చేజర్ల జనవరి 30 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలో ఇటీవల పంచాయితీరాజ్‌లో ఉపాధీ హామి పథకం ద్వారా మంజూరై పూర్తి చేసిన సిమెంటరోడ్లును నెల్లూరు విజిలెన్స్ క్వాలిటి కంట్రోల్ పిఆర్ ఇఇ చంద్రారెడ్డి గురువారం తనీఖీ నిర్వహించారు. ఈ సందర్బంగా 13 గ్రామాలో 82 లక్షల రూపాయాలతో నూతనంగా సిసి రోడ్లను నిర్మించారు. అందుకు సంబందించిన నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. ఎన్‌వీ కండ్రిక ఆదూరుపల్లి కొలపనాయుడు పల్లి చిత్తలూరు ,బోడిపాడు, మడపల్లి, తూర్పు కంభంపాడు, యన మదల, బిల్లిపాడు, కాకి వాయి, నాగుల వెలటూరు, గ్రామాలలో సిమెంట్‌రోడ్లును కోర్ ద్వారా పరిశీలి ంచారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌ఏఈ కెవి ప్రసాద్, పంచాయితీరాజ్ ఏఇ హరీష్ సిబ్బంది ఉన్నారు.

## టిడిపినేత గోసు రవి కుమార్తె శిరీష వివాహనలుగులో పాల్గొన్న ఎమ్మెల్యే



**కావలి, జనవరి30 ప్రభాతవార్త :** కావలి పట్టణ 23వ వార్డుకు చెందిన టిడిపినేత గోసు రవి కుమార్తె శిరీష వివాహ నలుగు కార్యక్రమంలో గురువారం కావలి ఎమ్మెల్యే దుగమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు. నూతన వధువు శిరీషను ఆశీర్వదించారు. ఆయన వెంట టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధానకార్యదర్శి జ్యోతి బాబురావు, పలువురు పాల్గొన్నారు.

## స్టూడెంట్స్ వెలెనెస్ లైప్ స్టైల్ ప్రోగ్రామ్




**బుచ్చి జనవరి 30 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం డిఎల్‌ఎన్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్టూడెంట్స్ వెల్‌నెస్ లైప్ స్టైల్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రముఖ కౌన్సిలింగ్ గైనకాలజిస్టు వి.చంద్రశేఖర్ ప్రణవ (యోగా హెచ్‌ఆర్‌డి ట్రైనర్ )చే విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితులలో విద్యార్థులు లైప్ స్టైల్ ఏలా ఉండాలో ఆయన వివరించారు.ఈకార్యక్రమంలో జాతీ పితమహాత్మగాందీకి నివాళుల ర్పిం చారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ తిరివీధి సుబ్రమణ్యం, సెక్రటరీ పి.మస్తాన్‌బాబు, ట్రెజరర్ సరాబు వెంకట నాగేశ్వరరావు,పాస్టు ప్రెసిడెంట్ దరిశి బాల నరసింహారావు, అధ్యాప బృందం, విద్యార్థులు పాల్గో న్నారు.

## అన్న క్యాంటీన్లో ఘనంగా పిడికిటి వెంకటేశ్వర్లు జన్మదిన వేడుక

**కందుకూరు, జనవరి 30, ప్రభాతవార్త :** పట్టణంలోని అన్న క్యాంటీన్లో మాజీ తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు జన్మదిన సందర్భంగా గురువారం మూడు పూట్ల ఉచిత భోజన ఏర్పాట్లు చేశారు. ఈ నేపధ్యంలో పలువురు పుర ప్రముఖులు, పిడికిటి వెంకటేశ్వర్లుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ బాధ్యులు ముచ్చు శ్రీను ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్న క్యాంటీన్ బాధ్యులు గుండవరపు లక్ష్మీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సోమిశెట్టి బ్రహ్మయ్యను పరామర్శించిన ఎమ్మెల్యే



**కావలి, జనవరి30 ప్రభాతవార్త :** కావలి 23వ వార్డులో నివసిస్తున్న స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకుడు సోమిశెట్టి బ్రహ్మయ్య అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సపొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి గురువారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని తెలిపారు. అండగా ఉంటానని అతనికి భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట మాజీ మున్సిపల్ ఛైర్మన్ పోతుగంటి అలేఖ్య, టిడిపి నేతలు పాల్గొన్నారు.

## రైతులకు పశువుల మిశ్రమ దాణా శిక్షణ



**ముత్తుకూరు, జనవరి 30, ప్రభాతవార్త :** కృష్ణపట్నం గ్రామాలకు చెందిన పశువుల పెంపకం రైతులకు తక్కువ ఖర్చుతో స్థానికంగా లభించే పదార్ధాలతో పశువుల మిశ్రమ దాణాను తయారు చేయడానికి పశువుల పాల ఉత్పత్తిని పెంచడానికి పశువుల మిశ్రమ దాణాను తయారి విధానాన్ని ఆదానీ ఫౌండేషన్ తమ కార్యాలయంలో గురువారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. కృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేశారు. శిక్షణా కార్యక్రమంలో చిల్లకూరు మండల మోమిడి పశుసంవర్ధక కేంద్రం పశుసంవర్ధక శాఖ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఫిరాజ్ ఖాన్ ఆధ్వర్యంలో లింగవరం గ్రామ వెటర్నరీ అసిస్టెంట్ హరీష్, మోమిడి గ్రామ పశువైద్యాధికారి జగదీష్ పాల్గొన్నారు. పశువుల పెంపకం రైతులకు పశువుల మిశ్రమాన్ని ఎలా తయారు చేయాలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన రైతులు మాట్లాడుతూ ఆధానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ మిశ్రమ దాణాను తయారీ విధానం వలన తక్కువ ఖర్చు పశువుల పాల ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధానీ ఫౌండేషన్ హెడ్ రాజేష్ రంజన్, షేక్ షాహుల్, హమీద్, డా. సిహెచ్ రమేష్ బాబు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## జాతిపిత మహాత్మునికి ఘన నివాళులు



**ఉలవపాడు, జనవరి 30, ప్రభాతవార్త :** జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఉలవపాడు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉలవపాడు గ్రామంలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులందరూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉలవపాడు మండల ఆర్యవైశ్య సంఘఅధ్యక్షులు బాపనపల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహం ద్వారా దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహనీయులు మహాత్మాగాంధీ అని అన్నారు. ఆయన చూపిన సత్యం అహింస మార్గాల్లో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ఉపాధ్యక్షులు బలసా సురేష్ కుమార్, సెక్రటరీ పొన్నూరు రామాంజనేయులు, జాయింట్ సెక్రటరీ దివ్యనందగుప్త, కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## డ్రిప్పు రుణాలు రైతులు చెల్లించాలి

**ఉదయగిరి, జనవరి 30, ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 31న బిందు సేద్య రుణాలకు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారని రైతులు బిందు సేద్య రుణాలు చెల్లించాలని ఉద్యానశాఖ అధికారి జయశ్రీ అన్నారు. మండల పరిధిలోని అప్ప సముద్రం గ్రామంలో పర్యటించి రైతులకు వివరాలు తెలియజేశారు. సదరు రైతులు గ్రామ స్థాయిలోని రైతు సేవా కేంద్రంలో గల గ్రామ వ్యవసాయ సిబ్బందికి తెలియపరిచి వారి దగ్గర ఉన్నటువంటి రుణం ఎంత చెల్లించాలి అనేది పూర్తి స్థాయిలో తెలుసుకుని సదరు రుణాన్ని 31వ తేదీ రోజున కట్టవలసిందిగా ఆమె రైతులను కోరారు. ఈమె వెంట గ్రామ ఉద్యాన సహాయ అధికారి బి.శేఖర్ ఉన్నారు.

## కొత్త కాలువకి శుంకుస్థాపన



**ఉదయగిరి, జనవరి 30, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి గవర్నమెంట్ హాస్పిటల్ వెనుక వైపు ఉన్న కొత్త కాలువకి శంకుస్థాపన గురువారం చేయడం జరిగింది. ఉదయగిరి సర్పంచ్ పాములూరి సామ్రాజ్యం ఉప సర్పంచ్ ముత్తుజ హుస్సేన్ అభ్యర్థన మేరకు స్థానిక ఎంపీపీ మూలే పద్మజా వినయ్‌రెడ్డి ఎంపీపీ నిధులతో చేయడం జరిగింది. అడగంగానే ఒప్పుకున్న ఎంపీపీకి స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి బిల్‌వన్ ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి, ఎంపీటీసీ షేక్ పెద్ద మస్తాని, వార్డు మెంబర్లు ఉప్పుటూరు శ్రీను, ఉప్పుటూరి హరి, ఎంఏ రియాజ్, ఎస్థాని, 4వ వార్డు మెంబరు ఖాదర్ భాషా, 8వ వార్డు మెంబరు జెబి, వక్ఫ్‌బోర్డు మెంబరు గడియాల్చి ఎస్థాన్, సీనియర్ నాయకులు అకుల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాల వసతుల కల్పనపై ఆరా



**ఉదయగిరి, జనవరి 30, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కల్పిస్తున్న వసతులపై సీఆర్‌డీపీ డీఆర్పీ జి.కళ్యాణ్ ఆరా తీశారు. పాఠశాలలో మౌలిక వసతులు క్రీడా మైదానం పాఠశాల యాజమాన్య కమిటీల తీరు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమలు గతంలో జరిగిన నాడు నేడు పనులు పరిశీలించి వంటి అంశాలపై ఆయన హెడ్‌మాస్టర్ బాలకేశవుల్ని అడిగి తెలుసుకున్నారు. ఆయా పాఠశాల వివరాలు సేకరణ అనంతరం పేరెంట్స్ కమిటీ ద్వారా గ్రామ సభ నిర్వహించి నివేదిక అందిస్తామన్నారు.

## ఘనంగా జీవీఎస్‌ఎం కళాశాల వార్షికోత్సవం

**ఉలవపాడు, జనవరి 30, ప్రభాతవార్త :** జీవితంలో విద్యార్థి దశ ఎన్నో మధుర జ్ఞాపకాలను నింపుతుందని అందుకు తగ్గట్టు తమ విలువైన సమయాన్ని ఉన్నత స్థాయికి చేరే లక్ష్యంతో సరైన ప్రణాళికను రూపొందించుకోవాలని ఎంఈఓ కే.శివ నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం జీవీఎస్‌ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల 47వ వార్షికోత్సవ వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ కే.శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ హైస్కూల్ పెద్దపుట్టపుపాలెం హెడ్ మాస్టర్ ఎస్‌కే సలీం భాషా, చాకిచర్ల కే.జనార్ధన్‌రావు హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం కళాశాల అకడమిక్ ఆన్యూవల్ రిపోర్ట్‌ను సీనియర్ లెక్చరర్ గారపాటి గోపి చంద్,ప్రకాష్ వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది జ్యోతి, రఫీ, గంగా భవాని, హనుమంతరావు, సుబ్బాచారి, శ్రీనివాసులు, సుభాషిణి, మాధవరెడ్డి, మల్లిఖార్జున, వెంకటేశ్వర్లు, వల్లూరయ్య, రాము, రత్తమ్మ, వరలక్ష్మీ పాల్గొన్నారు. అనంతరం ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం జరిగింది. మధ్యాహ్నం నుండి విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## ఉచిత పశువైద్యశిబిరం



**మనుబోలు జనవరి 30 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనుబోలులోని ప్రాంతీయ పశువైద్యశాల నందు పశువైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఏడి గురవారెడ్డి మాట్లాడు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మండలంలో ఇప్పటి వరకు 18 పంచాయితీలలో 2 బృందాలుగా ఏర్పడిగత పది రోజులుగా ఈకార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు .గురువారం మనుబోలులో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసి పశువులను,దూడలను,గోర్రెలను, పరిశీలించి వాటికి అవసరమైన మందులను పంపీణి చేశారు. దీని ద్వారా అనేక మంది పాడి రైతులు లబ్దిపొందారని తెలిపారు. ఈకార్యక్రమంలో పశువైద్యసిబ్బంది గౌతమి,శ్రీనివాసులు, అజ్మల్,షబ్బీర్, హామీద్, నీటి సంఘం అధ్యక్షులు పచ్చిపాలు రామిరెడ్డి, సాని వెంకటరమణయ్య, పచిపాల శ్రీకాంత్, మారంరెడ్డి రమణారెడ్డి, పాడి రైతులు పాల్గోన్నారు.

## దరిశి లక్ష్మీనరసయ్య జ్ఞాపకార్దం పేదలకు దుప్పట్లు పంపీణి



**బుచ్చి జనవరి 30 ప్రభాతవార్త :** వరల్ట్ లెప్రసీ దినోత్సవం సందర్బంగా బుచ్చిరెడ్డిపాళెం ప్రభుత్వ వైద్యశాలలో కుష్టు వ్యాధిగ్రస్తులకు మరియు పేదలకు దరిశి లక్ష్మీనరయ్య జ్ఞాపకార్దం కుమారుడు దర్శి బాల నరసింహారావు దుప్పట్లు పంపీణి చేశారు. ఈ కార్య క్రమంలో లయన్స్‌క్లబ్ ప్రెసిడెం ట్ తిరివీధి సుబ్రమణ్యం, సెక్రటరీ మస్తాన్‌బాబు, దర్శి మహేష్, హాస్పటల్ సిబ్బంది, సీనియరల్ హెల్త్ ఆఫీసర్ ఎ .సుబ్బారావు , తదితరులు పాల్గోన్నారు.

## మహాత్మాగాంధి విగ్రహానికి నివాళులర్పించిన రెడ్‌క్రాస్ ప్రతినిధులు



**కావలి, జనవరి30 ప్రభాతవార్త :** కావలి రెడ్‌క్రాస్ ప్రాంగణంలో మహాత్మాగాంధి వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మహాత్ముని బోధనలను వారుచూపిన మార్గాన్ని అనుసరించేదిశగా కంకణబద్దులమవడం రెడ్‌క్రాస్‌సభ్యుల ప్రధమకర్తవ్యమని డాకారపు రవిప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లాసభ్యుడు కావలి కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డి, కె.హరినారపరెడ్డి, గాదిరెడ్డి హరనాథ్, వివిస్.ప్రసాద్, ఐ.రాజశేఖర్, రక్తకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీజీ అడుగుజాడల్లో అందరూ పయనించాలి



**కావలిరూరల్, జనవరి30 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని డాక్టర్ లక్ష్మీకృష్ణారావు విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలనందు గురువారం గాంధీజి వర్ధంతి కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. ద్వారకానాథ్‌చౌదరి ఆదేశాలమేరకు నిర్వహించడం జరిగింది. ఈసంద ర్భంగా గాంధీజి చిత్రపటానికి పూలమా లలువేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. అనంతరం పాఠశాల గణిత ఉపాధ్యాయులు సిహెచ్ .బ్రహ్మయ్య మాట్లాడారు. గాంధీజి అడుగుజాడల్లో అందరూ పయనించాలన్నారు. గాంధీమహాత్ముని జీవితచరిత్రను, వారి సత్యనిష్ఠను, స్వాతంత్ర్య అహింసాపోరాటాల ఉద్యమాల గురించి, అంటరానితనం నిర్మూలనకు, హిందూ, ముస్లింల ఐక్యతలకు ఆయన ఎంతగానో కృషిచేశారని తెలియచేశారు. పాఠశాల 1974-75 సంవత్సరం 10వ తరగతి పూర్వవిద్యార్థులు, పాఠశాల విద్యార్థులు రెండునిముషాలు గాంధీమహాత్మునికి మౌనంపాటించి నివాళులర్పించారు. ఈ కారక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ బదిలీ

**నెల్లూరు క్రైం, జనవరి 30, ప్రభాతవార్త :** జిల్లా కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ శ్రీరామ రాజారావును ప్రభుత్వం ఏపీ స్టార్స్‌కు బదిలీ చేసింది. ఇటీవల రాజారావు పై పలు అవినీతి ఆరోపణలు రావడం, రిమాండ్ ఖైదీలతో ఆయన సంభాషణల ఆడియో సామాజిక మాధ్యమాలలో వైరల్ కావడంతో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత విచారణకు ఆదేశించారు. జైలు శాఖ డిఐజీ వరప్రసాద్ విచారణ జరిపి నివేదిక సమర్పించారు. దీంతో ప్రభుత్వం ఏపి స్టార్స్‌కు రాజారావును బదిలీ చేసింది. ఆయన స్థానంలో జిల్లా జైళ్ళ అధికారి వెంకటేశ్వర్లు కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు.

## కందుకూరు వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు



**కందుకూరు,జనవరి 30, ప్రభాతవార్త :** పట్టణంలోని వాసవి క్లబ్ లెజెండ్స్, వనిత క్లబ్ ల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఎమ్మార్వో ఆఫీసులో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య నాయకులు చీదెళ్ల వేణుగోపాల్‌రావు, చక్కా వెంకట కేశవరావు, కోట నరసింహ మహాత్మా గాంధీజీ చేసినటువంటి స్వాతంత్ర్య పోరాటాల గురించి మాట్లాడారు. మహాత్మాగాంధీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ కూడా నడవాలని కోరారు. వాసవి క్లబ్ లెజెండ్స్ ప్రెసిడెంట్ చీదెళ్ళ కృష్ణ, వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ నారాయణ, సుకన్య, సెక్రటరీ పేరూరి లలిత, ట్రెజరర్ తటవర్తి బీబీజానమ్మ, ఆర్‌సీ కోట వెంకటేశ్వర్లు, జెడ్‌సీ కొత్తూరి నటరాజ కుమారి, రవ్వా శ్రీనివాసులు, గుర్రం వెంకటేశ్వర్లు, గుర్రం అల్లూరయ్య, చీదెళ్ల సోమశేఖర్, చీదెళ్ల స్వప్న, చీదెళ్ల హిమబిందు పాల్గొన్నారు.

## పట్టణ ప్రజల పరిశుభ్రకు ప్రాధాన్యత



**కందుకూరు, జనవరి 30, ప్రభాతవార్త :** పట్టణ ప్రజలకు పరిశుభ్రతకు, పట్టణంలో నీటి కాలుష్యం నివారించి ప్రజలకు ఆరోగ్యక రమైన వాతావరణం అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు పురపాలక సంఘం పరిధిలో 19.40 కోట్ల స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులతో మురుగు నీటిని శుద్ధి చేసి 9.6 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నూతనంగా నిర్మిస్తున్న శుద్ధి కర్మాగార కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం ధీటైన చర్యలు చేపట్టిందని దానిలో భాగంగానే మురుగునీటి శుద్ధి కేంద్రం కర్మాగారాలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగునీటి శుద్ధి చేయడం అత్యంత అవసరమని కందుకూరు మున్సిపాలిటీ రానున్న కాలంలో ఒక క్లీన్ మున్సిపాలిటీ మార్చేలా అన్ని చర్యలు తీసుకుంటామని మురుగు నీటి పారుదల సమస్యను తగ్గించేందుకు ఈ శుద్ధి కర్మాగారం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. మురుగునీటి శుద్ధి కర్మాగారం శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా అక్కడున్న అధికారులు ఈ శుద్ధి కర్మాగారంలో మురుగునీటిని శుద్ధి చేసే ప్రక్రియను అధికారులు ఎమ్మెల్యేకి వివరించారు. వీలైనంత త్వరగా ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కే.అనూష, మున్సిపల్ డీఈ గణపతి పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, వడ్డేపల్లి వెంకటరావు, దివి మాధవరావు, నల్లూరి వీర రాఘవులు, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లండి




**వలేటివారిపాలెం జనవరి 30, ప్రభాతవార్త :** ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అధికారులుకు సూచించారు. తద్వారా ప్రభుత్వ పనితీరును ప్రజలకు తెలియచేయాలని ఆయన అన్నారు. వలేటివారిపాలెం మండలపరిషత్ సర్వసభ్య సమావేశంలో గురువారం స్దానిక మండల పరిషత్ ఆవరణలో ఎంపీపీ మౌనిక సమక్షంలో ఎంపీడీవో నరేంద్రదేవ్ అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమంలో శాసనసభ్యులుతోపాటు జెడ్పీటీసీ సభ్యురాలు ఇంటూరి భారతిలు అతిధులుగా పాల్గొన్నారు.ఎమ్మెల్యే,ఎంపీపీ,జెడ్ పీటీసీలు ముగ్గురు ప్రముఖులు బడేవారిపాలెంగ్రామానికి చెందిన వారు కావడం ఆసక్తిదాయకం.సభకు హాజరైన ప్రజాప్రతినిధుల్లో ఎమ్మెల్యే అధికారపక్షానికి చెందిన వ్యక్తికాగా ఎంపీపీ,జెడ్పీటీసీతోపాటు ఎంపీటీసీలు,విపక్షానికి చెందని వారు కావడం గమనార్హం.అయినా శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు,జెడ్పీటీసీ సభ్యులు దగ్గరి బంధువులు కావడం పైగా ఇద్దరూ వాక్చాతుర్యం కలవారు కావడంతో సభ ఆసక్తికరంగా ఉంటుందని పలువురు భావించారు. అయితే సభామర్యాదలు పాటిస్తూ అధికార, విపక్షాలు సుదీర్ఘంగా ప్రజా సమస్యలపై చర్చించారు.ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసికెళ్లి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకరావాలని ఎమ్మెల్యే కోరారు. ముగింపు సందర్భంగా ఎమ్యెల్యే మాట్లాడుతూ కేవలం నెలల్లో 15కోట్లుతో సీసీ రోడ్లువేశామన్నారు.మరో 9కోట్లుతో కలవళ్ల,కొండసముద్రం, వీఆర్‌కోట గ్రామలకు లింకురోడ్లు వేయనున్నట్లు తెలిపారు. సూర్యఘర్ పథకంను వినియోగంచుకొని విద్యుత్‌ను ఆదా చేసుకోవాలన్నారు.గ్రామసభల ద్వారా రెవిన్యూసమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వాలు ఏవైనా ప్రజలకు న్యాయం జరగాలని జెడ్పీటీసీ భారతి మాట్లాడడంతో సభ సజావుగా జరిగింది.తొలుత వైద్యశాఖ ప్రతినిధిగా డా॥ శివప్ప మాట్లాడుతూ తమ సిబ్బంది బాగా పనిచేస్తున్నారని ఇందుకు సంబందించిన నివేదికలునా న్నయని వివరిస్తుండగా ఎమ్మెల్యే కలుగుచేసికొని నివేదికలు ముఖ్యం కాదని ప్రభుత్వ లక్ష్యం ప్రజలకు చేరాలని అన్నారు. ఏ గ్రామంలో అవగాహన ఉందో చూపించగలవా అని డాక్టర్‌ను ప్రశ్నించారు.ప్రజారోగ్యం నిమిత్తం లక్షలాది రూపాయలు వెచ్చించి పలు పథకాలు అమలు చేస్తుంటే క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం వైద్యశాఖ విఫలమైందన్నారు. సిబ్బందితోపాటు ఆషావర్కర్లు ఏమిచేస్తున్నారని ప్రశ్నించారు.వారితోపనిచేయించాలన్నారు. అదేవిధంగా రెవిన్యూ కార్యాలయ పనితీరుపై సైతం అసహనం వ్యక్తం చేశారు.పక్కాగృహాల నిర్మాణాలకు 1190మంది ధరఖాస్తుచేస్తే కేవలం 190మందికి మాత్రమే పొజిషన్ సర్టిపికెట్లు ఇచ్చారని హౌసింగు ఏఈ నాగరాజు సభకు వివరించారు. దీనితో ఎమ్మెల్యే రెవిన్యూ కార్యాలయ పనితీరును బాగా లేదన్నారు.పొజిషన్ సర్టిపికెట్‌ల పని పూర్తి చేయాలని డీటీ నాయబ్‌రసూలుకు సూచించారు.ఎంఈవో మల్లికార్జున మాట్లాడుతూ పాఠశాలల్లో జరుగుతున్న రేషనలైజేషన్‌ను వివరించారు. ఈ సందర్బంగా వైసీపీ ఎంపీటీసీ రవీంద్ర మాట్లాడుతూప్రభుత్వ పాఠశాలల్లో ఏటా పిల్లలు తగ్గిపోతున్నారని ఇందుకు బాధ్యులెవరని ప్రశ్నించారు.పశువైద్యాధికారి డా॥ వంశీ,విద్యుత్ ఏఈ మధుబాబు,ఆర్‌డబ్లుఎస్ ఏఈలు ఆయా శాఖల పనితీరును వివరించారు.ఉప్పలపాడు సర్పంచ్ విజం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాతీయ రహదారినుంచి తమ గ్రామంలోకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని అడగగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.తగిన చర్యతీసుకోవాలని ఏఈ మధుబాబుకు సూచించారు.

## వైసిపి నాయకుడు డాక్టర్ అల్లాబక్షుకు తీవ్ర అస్వస్థత



**బుచ్చి జనవరి 30 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని 7 వవార్డు వైసిపి ఇన్‌చార్జి, 7 వవార్డు కౌన్సిలర్ షేక్.షకిలా బేగం భర్త డాక్టర్ అల్లాబక్ష తీవ్ర అస్వస్థతకు గురైయ్యారు. నెల్లూరులోని కిమ్స్ హాస్పటల్‌లో ఆయన చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రి,వైసిపి అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి,డిసిఎంఎస్ మాజీ చైర్మన్ వీరిచలపతిరావు, బుచ్చినగర పంచాయితీ కౌన్సిలర్లు షేక్.షాహుల్, టౌన్ అద్యక్షులు టంగూరు మల్లికార్జునరెడ్డి,రూరల్ అద్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, కౌన్సిలర్ కోటంరెడ్డి లలితారెడ్డి,కౌన్సిలర్ యానాదిరెడ్డి, కంతా అనంతమ్మ,బెళ్ళం మల్లారెడ్డి,యరటపల్లి శివకుమార్‌రెడ్డి కిమ్స్‌లో అల్లాబక్షను చూసి షేక్ షకిలా బేగంకి ధైర్యం చెప్పారు.డాక్టర్లకు మెరుగైన వైద్యం అందించమని కోరారు.

## 7 లోగా కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి



**కోవూరు,జనవరి 30 పభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు అర్హత కలిగిన వారు ఫిబ్రవరి 7వ తేది లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి తెలిపారు. కోవూరులోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ జనవరి 30వ తేది నుంచి ఈ ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ కార్పొరేషన్ రుణాలకు అర్హత కలిగిన వారు సంబంధిత అర్హతలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 8వ తేది నుంచి 11వ తేది వరకు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ముగిసిన పశు వైద్య శిబిరాలు



**కోవూరు,జనవరి 30 పభాతవార్త :** కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరాలు పూర్తి అయ్యాయి. ఈ మేరకు గురువారం లేగుంటపాడు పశు వైద్యశాలలో పశు వైద్యులు డాక్టర్ ప్రీతి సాల్మన్ ఆధ్వర్యంలో 150 గేదెలకు నట్టల నివారణ మందును, 46దూడలకు నులిపురుగుల మందును, 105 గొర్రెలకు వ్యాధినిరోధక శక్తిని పెంపొందించే మందులను అందించారు. అదేవిధంగా ప్రస్తుత సీజన్‌లో గొర్రెల్లో బొబ్బర్ల జబ్బు రాకుండా టీకాలు కూడా వేసేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పశు సహాయకులు , పాడి రైతులు ఉన్నారు.

## ఘనంగా షిరిడీ సాయినాధునికి పూజలు



**కోవూరు,జనవరి 30 పభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయి మందిరంలో మాఘమాస గురువారం పర్వదినం సందర్భంగా సాయినాధునికి ప్రాత:కాలమునే ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పంటపాలెం సచివాలయంలో కొత్త ఆధార్ కార్డు నమోదు



**ముత్తుకూరు, జనవరి 30, ప్రభాతవార్త :** మండలంలోని పంటపాలెం గ్రామ సచివాలయంలో కొత్త ఆధార్ కార్డు నమోదు కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షులు పల్లంరెడ్డి రామ్మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధార్ కార్డు నమోదుతో పాటు చేర్పులు, మార్పులు కూడా నిర్వహించారు. ఆధార్ కార్డు నమోదు చేసుకునే వారికి ఆయన దగ్గరుండి ఆధార్ కార్డులు నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పల్లంరెడ్డి శ్రీధర్ రెడ్డి, యదనపర్తి శ్యామ్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి చలపతి రావు, రెవెన్యూ అధికారి భక్తవస్తల రెడ్డి, పంచాయితీ కార్యదర్శి డిజిటల్ అసిస్టెంట్ భైన నిరంజన్, సంక్షేమ అధికారులు నవీన్ కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వయం ఉపాది రుణాల కొరకు దరఖాస్తు చేసుకోండి



**అనంతసాగరం,జనవరి30,ప్రభాతవార్త:** బిసి, కాపు, రెడ్డి, కమ్మ, వైశ్య , ఎస్సీ కార్పోరేషన్ స్వయం ఉపాది రుణాల కొరకు ఫిబ్రవరి 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని అనంతసాగరం మండల అభివృద్ధి అధికారి పి.ఐజాక్‌ప్రవీణ్ గురువారం తెలిపారు. అర్హత కలిగిన వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, రెండు పాస్‌ఫోటోలు, ఎపి ఒబి ఎంఎంఎస్ వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

## పెళ్లీడు వయస్సు వచ్చిన తర్వాతనే వివాహాలు చేయాలి



**కోవూరు,జనవరి 30 పభాతవార్త :** తల్లిదండ్రులు తమ బిడ్డలకు పెళ్లీడు వయస్సు రాకుండానే బాల్య వివాహాలు చేయడం వలన భవిష్యత్తులో వారు అనేక సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని కోవూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు పంచాయతీ అట్ల కాలనీలో గురువారం బాల్య వివాహాలు, తదితర అంశాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లకు పెళ్లీడు వయస్సు రాకుండానే వివాహం చేస్తే వారికి ఆరోగ్యపరమైన సమస్యలు ఉత్పన్నం అయ్యే పరిస్థితి వస్తుందన్నారు. వాస్తవంగా బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, దీనికి శిక్షలు కూడా ఉన్నాయన్నారు. అనంతరం ప్లకార్డులు ధరించి గ్రామంలో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.

## పశు గర్భకోశ వ్యాధులపై రైతులకు అవగాహన ఏడి కృష్ణ మౌర్య



**విడవలూరు, జనవరి 30, ప్రభాతవార్త :** మండలం వరిణి, దంపూరు పంచాయితీ గోల్కొండ తోపు గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరం కోవూరు ఏడిఐ కృష్ణ మౌర్య ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువులకు ఎలుగు పాముల మందు, సాధారణ పవువులకు గర్భకోశ వ్యాధులు గర్భం దాల్చే పరీక్షలు చేయడం జరిగిం దన్నారు. అదే విధంగా గొర్రెలు, మేకలకు సిప్యాక్సి టీకాలు కోళ్లకు తెగుళ్ళు తదుపరి టీకాలు వేయడం జరిగింది. ప్రతి రైతు పాడి పశువులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. అవసరమైన వ్యాధులకు సంబంధించి అందుబాటులో ఉన్న సిబ్బందిని సంప్రదించి వ్యాధి నివారణ చేసుకోవాలని వివరించారు. రెండు పంచాయితీల్లో పాడి పశువులకు మేకలు, గొర్రెలు వాటిపై రైతన్నలు జాగ్రత్తలు తీసుకున్నట్లైయితే మంచి లాభం రావడం జరుగుతుందని తెలియజేశారు. ఈ నెల 20వ తేది నుండి 30వ తేది వరకు ఉచిత పశు వైద్య శిభిరాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య అధికారిని వాణి శంకర్, సర్పంచ్ రావెళ్ల మల్లికార్జున్, సిబ్బంది నన్నం రాజశేఖర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీవితం మానవాళికి మార్గదర్శకం



**వింజమూరు, జనవరి30,ప్రభాతవార్త:** మహాత్మాగాంధీ జీవితం మానవాళికి మార్గదర్శకమని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ పేర్కొన్నారు. గురువారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ ప్రతిపా ధించిన గాంధీ స్వరాజ్యం ఈ రోజు పంచాయతీ రాజ్ వ్యవస్థకు మూలమన్నారు. గ్రామ పంచా యతీలు అట్టడుగు స్థాయిలో రాజకీయ, ఆర్థిక , ప్రజాస్వామ్యాన్ని ప్రారంభించేందుకు అత్యంత ఆదర్శ వంతమైన వ్యవస్థ నేడు పంచాయతీరాజ్ వ్యవస్థ అన్నారు. స్వతంత్ర ఉద్యమంలో గాంధీజీ అహింసాయుత పోరాటం దేశప్రజలకే కాదు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలకు స్పూర్తిదాయకంగా నిలిచిందన్నారు.గాంధీజీ జీవితం ఆదర్శాలు ప్రపంచ మానవాళికి ఆదర్శ మన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కోదూరు నాగిరెడ్డి, నాయకులు పాములపాటి మాల్యాద్రి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగపట్ల వెంగయ్య, మండల టిడిపి అధ్యక్షుడు ఆరికొండ శ్రీనివాసులు, నీలం పెరుమళ్ళు, శివుడు తదితరులు పాల్గొన్నారు.

## కౌశల్యమ్మ ఉత్తరక్రియల్లో మంత్రి ఆనం



**వింజమూరు, జనవరి30,ప్రభాతవార్త:** మాజీ ఎఫ్‌సిఐ డైరెక్టర్ అంకినపల్లి ఓబులురెడ్డి సతీమణి అంకినపల్లి కౌశల్యమ్మ గురువారం జరిగిన ఉత్తరక్రియలకు దేవా దాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరయ్యారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్య క్రమంలో మెట్టుకూరు ధనుంజయరెడ్డి, పుట్టం బ్రహ్మానందరెడ్డి, రిటైర్డ్ డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ మాశి లామణి, నాయకులు వనిపెంట వెంకటసుబ్బారెడ్డి, వివిధమండలాల పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమాలకు బియ్యం పంపిణీ



**నెల్లూరు, జనవరి 30, ప్రభాతవార్త –వైద్యం :** రూరల్ నియోజకవర్గం పరిధిలోని అయ్యప్ప గుడి సమీపంలోని ప్రగతి చారిటీస్ మానసిక వికలాంగుల ఆశ్రమంలో సృజన సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి ఘనంగా జరిగింది. ఈ సంద ర్భంగా ఆశ్రమానికి బియ్యం బస్తాలను వితరణ గావించారు. ఆశ్రమంలోని వారందరికి బిస్కెట్ ప్యాకెట్లు, అరటిపండ్లను పంచిపెట్టారు. ఇదే వేదికపై పలు ఆశ్రమాల నిర్వాహకులకు కూడా బియ్యం బస్తాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సృజన అధ్యక్షులు దగ్గుపాటి రాధాకృష్ణ నిర్వహి ంచిన ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు పెనాక సుజాతరెడ్డి, వరపరివార్ సేవా ఫౌండేషన్ చైర్‌పర్సన్ ఎస్.మాధవి, మన హాస్పిటల్ అధినేత డాక్టర్ మారం సుధాకర్, పన్మ, లీనా తదితులు ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రసంగించారు.

## కొత్తూరు ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**బిట్రగుంట జనవరి 30 ప్రభాతవార్త:** బోగోలు మండలంలోని విశ్వనాథరావుపేట పంచాయతీలో కొత్తూరు గ్రామంలో గురువారం ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు పూర్తి చేసు కున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లు జయమ్మ, నరసింహా రావులు మాట్లాడుతూ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సంద ర్భంగా పూర్వ విద్యార్థులందరూ కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించుకోవడం ఎంతైనా అభినం దనీయ మన్నారు. దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో కూడా మౌలిక వసతులు కల్పించేందుకు పూర్వ విద్యా ర్థుల తమ వంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా వారు కోరారు.ఆత్మీయ సమావే శంలో తమ పాఠశాల అప్పటి పరిస్థితులు, ఇప్పటి పరిస్థితులు పై వారు చర్చించుకుని తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కూడా పాల్గొన్నారు.

## మహాత్ముని అడుగుజాడల్లో యువత పయనించాలి



**కోవూరు,జనవరి 30 పభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ నేతాజీనగర్‌లో ఉన్న వైకేఆర్‌అండ్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురు వారం పూజ్య బాపూజీ 77వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీపీ లక్ష్మీప్రసూన మాట్లాడుతూ నేటి యువత ఆ మహనీయుడు చూపిన బాటలో పయని ంచాలన్నారు. అహింసా మార్గంలో ఆయన చూపిన పోరాటం ఎనలేనిదన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ మహేంద్రరెడ్డి పలు సూచనలు చేశారు. కళా శాల అధ్యాపకులు , విద్యార్థులు ఉన్నారు.

## సతీష్ దావన్ స్పేస్ సెంటర్‌కు అభినందనలు



**కోవూరు,జనవరి 30 పభాతవార్త :** శ్రీహరికోట లోని సతీష్ దావన్ అంతరిక్ష కేంద్రం నుంచి గురువారం ప్రయోగించిన 100వ ప్రయోగం పూర్తిస్థాయిలో విజయ వంతమైంది. ఈ మేరకు కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికో న్నత పాఠశాల విద్యార్థులు , ఉపాధ్యాయులు 100 ఆకారంలో ఏర్పాటై సతీష్ దావన్ స్పేస్ సెంటర్ వారికి హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠ శాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన 100 ప్రయోగాలు పూర్తిస్థా యిలో విజయవంతం కావడం భారతదేశ కీర్తి ప్రతిష్టలు మారుమోగాయన్నారు. అప్రతిహ విజయాలతో షార్ సతీష్ దావన్ సెంటర్ ప్రపంచంలోనే ఒక మంచి ఉత్తమ అంతరిక్ష కేంద్రంగా రూపొందించాలని ఈ సందర్భంగా ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ దేవిక, పీఈటీ వెంకట సుబ్బమ్మ, కరిమున్నిసా, గీతామాధురి, తదితరులు ఉన్నారు.

## పబ్లిక్ హెల్త్ వర్కర్లకు మేస్త్రీలుగా ఉద్యోగోన్నతి



**నెల్లూరు కార్పొరేషన్,జనవరి 30,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థలోని పలు డివిజన్లలో నందు పారిశుధ్య వర్కర్లుగా విధులు నిర్వహిస్తున్న బి. చిన్న పాపయ్య, జి. భాస్కరయ్య, టి. శ్రీనివాసులు, ఎమ్. కిరణ్ కుమార్, మెక్ బహుదూర్ ఖత్రి , పి.జీవరత్నం, ఎస్. రాఘవులు లకు మేస్త్రీలుగా, అలాగే మేస్త్రిగా విధులు నిర్వహిస్తున్న జి. డేనియల్ ను హెల్త్ అసిస్టెంట్ గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కమిషనర్ సూర్య తేజ ఉత్తర్వులు అందించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నందు గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగన్నతి పొందిన సిబ్బంది అంతా పాల్గొన్నారు. విధులలో మరింత మెరుగైన క్రమశిక్షణ, నిబద్ధతో విధులు నిర్వహించాలని కమిషనర్ వారికి సూచించారు.

## విఎస్‌యూలో ఘనంగా మహాత్మ గాంధీ వర్ధంతి



**వెంకటాచలం,జనవరి 30 , ప్రభాతవార్త:** విక్రమ సింహ పురి యూనివర్శిటీ కాలేజీ ఎన్.ఎస్.ఎస్ యూనిట్ 4 ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి పుష్పాంజలి అర్పించే కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సారం గం విజయభాస్కర రావు విచ్చేసి అధ్యాపకులు,విద్యార్థులతో కలిసి గాంధీ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులును ఉద్దేశించి ప్రసంగిస్తూ గాంధీజీ సిద్ధాంతాలను స్మరిం చుకుంటూ సత్యం,అహింస, సత్యాగ్రహం వంటి విలువలను పాటించేలా ప్రతిజ్ఞ చేయాలని ఆకాంక్షించారు అలాగే మహాత్మా గాంధీ జీవితం, ఆయన త్యాగాలు, దేశ స్వాతంత్ర్యానికి చేసిన సేవలు చిరస్మరణీయమని గాంధీజీ భావజాలం అనేక దేశాలలో చాలామందికి స్పూర్తి నిచ్చాయని, గ్రామీణ అభివృద్ధి కోసం వారు నిరంతరం శ్రమ పడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలొ విశ్వవిద్యాలయ సచివులు డాక్టర్ కె.సునీత మాట్లాడుతు గాంధీజీ యొక్క ఆదర్శప్రాయమైన జీవితాన్ని అందరూ ఆచరిం చగలిగితే మనమందరం జీవితంలో ఉన్నత శిఖరాలకు వెళతామని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సి.హెచ్ విజయ,కావలి పీ.జీ సెంటర్ ప్రిన్సిపల్ ఆచార్య టీ.వీరారెడ్డి సి.డి .సి.డిన్ హుస్సేనయ్య , డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ హనుమరెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుజయ్ కుమార్, డిప్యూటీ రిజిస్టర్ సాయి ప్రసాద్ రెడ్డి ,ఫైనాన్స్ ఆఫీసర్ చాముండేశ్వరి, అధ్యాపకులు అధ్యాప కతర సిబ్బంది విద్యార్థులు ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## లెప్రసీపై అవగాహన సదస్సు



**సీతారామపురం జనవరి 30 ప్రభాతవార్త :** జాతిపిత మహాత్మ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని సీతారామపురం మండలంలోని బసినేనిపల్లి జడ్‌పిహెచ్‌ఎస్ నందు కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సును డాక్టర్ ఎ .స్వప్న ఆధ్వర్యంలో నిర్వహిం చారు .అనంతరం ఆమె మాట్లాడుతు కుష్ఠువ్యాధి మైకో బ్యాక్టిరియం లెప్రి వల్ల వచ్చునని ఇది వ్యాధి గ్రస్తులతో ఎక్కువ కాలం కలిసి వుండడం వలన ,స్పర్శ వలన రోగి దగ్గినప్పుడు,తుమ్మినప్పుడు సంక్రమించునని చర్మం మీద, పాలిపోయిన రాగివర్ణపు మచ్చలు ఉండి స్పర్శ లేకుండాను ,కాళ్ళు చేతులు తిమ్మిరిగా ఉండడం ,కనురెప్పలు మూత పడకుండా ఉన్నను కనుబొమ్మల వెంట్రకలు రాలిపోయినను లెప్రసి కేసుగా అనుమానించి హాస్పటల్‌కి వెళ్లాలని సూచించారు.లెప్రసి నిర్ధారణచేసి టిబి లెప్రసి అయితే 6 నెలల నుండి 9 నెలల వరకు చికిత్స,ఎంబి లెప్రసి అయితే 9 నెలల నుండి 12 నెలల వరకు చికిత్స కు మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ సందేశం చదివి పిల్లల చేత ప్రతిజ్ఞ చేయించారు.ఈకార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు ఉదయ్ కుమారి మరియు హాస్పటల్ సిబ్బంది,ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా సాయిబాబా పల్లకీసేవ



**సంగం జనవరి 30 ప్రభాత వార్త:** సంగం మండలం వెంగారెడ్డిపాళెం గ్రామంలోని సాయిబాబా మందిరంలో గురువారం సాయిబాబా వారి పల్లకీసేవ ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో స్వామి వారికి ప్రత్యేకాభిషేకాలు ,పూజలు నిర్వహించారు. పల్లకీసేవ అనంతరం సాయిబాబాకి ప్రత్యేక హారతులు ఇచ్చారు. పల్లకీసేవ అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## పలు కార్యాలయాలను సందర్శించిన జెడ్పీ డిప్యూటి సీఈఓ మోహన్‌రావు




**కావలిరూరల్, జనవరి30 ప్రభాతవార్త :** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాపరిషత్ డిప్యూటి సీఈఓ జె.మోహన్‌రావు గురువారం కావలి రూరల్ మండలం గౌరవరం సచివాలయాన్ని సందర్శించడం జరిగింది. అక్కడ ప్రస్తుతం జరుగుతున్న సర్వేలు, సచివాలయ రికార్డులను, హాజరు వివరములను, సిబ్బంది పనితీరును అడిగితెలుసుకోవడం జరిగింది. అనంతరం కావలి మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించడం జరిగింది. అన్ని పంచాయితీలలో 15 ఫైనాన్స్ గ్రాంట్ వినియోగ వివరములు, సిబ్బంది పనితీరు, హాజరు ప్రస్తుతం జరుగుతున్న సర్వేలలో మండలంయొక్క ప్రగతిల గురించి తెలుసుకోవడం జరిగింది. మండల పరిధిలో చేపట్టిన పనుల వివరాలు, అంశములను అడిగి తెలుసుకోవడం జరిగింది. మరింత ప్రగతిని సాధించుకొనుటకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ శ్రీదేవి, ఇన్‌చార్జి ఈఓపిఆర్‌డి అబ్దుల్ సమద్, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశయాలబాటలో పయనిద్దాం : ఎమ్మెల్యే



**కావలి, జనవరి30 ప్రభాతవార్త :** మహాత్మా గాంధీజీ ఆశయాలబాటలో అందరం పయనిద్దామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కావలి పట్టణ మాగుంట పార్వతమ్మరోడ్డులోని గాంధీజి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహాత్మా గాంధి సేవలు అమోఘమని కొనియాడారు. ఆయన అహింసాబాటలో అందరూ పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అద్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, టిడిపి పట్టణ ప్రధానకార్యదర్శి జ్యోతిబాబురావు, టిడిపి రాష్ట్ర లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది పోట్లూరు శ్రీనివాసులు, ఆర్యవైశ్యసంఘం అద్యక్షుడు తటవర్తి రమేష్, గాంధివిగ్రహ కమిటి బాధ్యుడు తిరివీధి ప్రసాద్, కుదవ సంఘం అద్యక్షుడు కోట రమేష్, టిడిపి, బిజెపి, జనసేన, ఆర్యవైశ్యసంఘం నేతలు పాల్గొన్నారు. గాంధీజి గొప్పతనాన్ని కొనియాడారు.

## మాజీ ఎమ్మెల్యేతో పలువురు టీడీపీ నాయకులు భేటీ



**ఉదయగిరి, జనవరి 30, ప్రభాతవార్త :** ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు గురువారం ఉదయగిరికి వచ్చిన సందర్భంగా పలువురు ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు బస్టాండ్ సెంటర్లో అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన వారితో కలిసి టీ తాగుతూ కాసేపు ముచ్చటించారు. అది అటు ఉంచితే ప్రస్తుత ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వర్గీయులు బొల్లినేని వెంకట రామారావుతో దూరంగా ఉండాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చెప్పినట్లు ఉదయగిరి నియోజకవర్గంలో ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు రాకతో పలువురు టీడీపీ నాయకులు ఆయనతో కలిసి ముచ్చటించారు. మరి తర్వాత పరిణామాలు ఎలా ఉండబోతాయో ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే మరి.

## గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెడుతున్న కూటమి ప్రభుత్వం



**కోవూరు,జనవరి 30 పభాతవార్త :** పూజ్య బాపూజీ, అహింసా మార్గంలో శాంతియుతంగా దేనినైనా సాధించవచ్చని ప్రపంచానికి చాటి చెప్పారని ఈ రోజు ప్రపంచమంతా ఆ మహనీయులు చూపిన బాటలో నడవడం , భారతీయులుగా మనందరికీ ఎంతో గర్వకారణమని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం కోవూరు గాంధీ పార్కులో ఉన్న మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే అహింసా మార్గంలో పోరాటం చేసి విజయం సాధించింది ఒక్క భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమం మాత్రమే అని దీనికి కారణం మహాత్మా గాంధీయే అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని భావించి గ్రామ స్వరాజ్యం కోసం ఆ మహనీయుడు ఎన్నో కలలు కన్నారన్నారు. ఆ మహనీయుని కలలను సాకారం చేస్తూ ప్రస్తుత ప్రభుత్వం గ్రామాల్లో పెద్దఎత్తున సిమెంట్ రోడ్లు, మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఐదేళ్ల పాటు గ్రామ పంచాయతీ నిధులు కూడా దారి మళ్లించి ఆ మహనీయుని ఆశయాలకు తిలోదకాలు ఇచ్చారన్నారు. ఆ మహనీయుని వర్థంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ ఆయన చూపిన బాటలోనే పయనించాలని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు సత్యనారాయణ రెడ్డి, విజయ్, శివకుమార్, మురళీకృష్ణారెడ్డి, గోపాల్, వెంకటేశ్వర్లు, నరసింహ, అశోక్, వహీద్, రియాజ్, ఉన్నారు.

## సత్యాగ్రహమే ఆయుధంగా అహింసా మార్గంలో పోరాడిన మహోన్నతవ్యక్తి మహాత్మాగాంధీ : ఎమ్మెల్యే



**ఇందుకూరుపేట, జనవరి 30, ప్రభాతవార్త :** సత్యాగ్రహమే ఆయుధంగా అహింస మార్గంలో పోరాడిన వ్యక్తి మహాత్మాగాంధీ అని కోవ్వూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. మండల ంలోని పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ ఆశ్రమంలో గురువారం ఆశ్రమ కన్వీనర్ గణేశం కల్పనమ్మ, కో కన్వీనర్ నెల్లూరు రవీందర్‌రెడ్డి రెడ్ క్రాస్ చైర్మన్ వాకాటి విజయ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మహాత్మా గాంధీ 77వ వర్ధంతి కార్యక్రమానికి కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వాకాటివిజయ్‌కుమార్‌రెడ్డి మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రము పూలమాల ఆశ్రమ స్థల దాత పొనక కనకమ్మ విగ్రహాలకు నూలుమాల ఆశ్రమ స్థల దాత పొనకా కనకమ్మ విగ్రహాలకు నూలుమాల , పట్టు వస్త్రం పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాటుపడుతున్నారని తెలిపారు. కోట్లాది భారతీయులకు స్వేచ్ఛ స్వాతంత్ర్యాన్ని అందించిన మహోన్నత వ్యక్తి గాంధీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్ర చౌదరి, షేక్ ఇంతియాజ్, అవ్వారు ఏడుకొండలు, చింతపంటి వెంకటరమణయ్య, మునగాల రంగారావు, మండల బీజేపీ అధ్యక్షులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, ఆశ్రమ మేనేజర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతిపితి మహాత్మాగాంధీ వర్ధంతి



**బుచ్చి జనవరి 30 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో వాసవి క్లబ్ మరియు ఆర్యవైశ్య సంఘం సంయుక్తంగా జాతిపితి మహాత్మగాంధీ వర్దంతని ఘనంగా నిర్వహించారు.వాసవి క్లబ్ ప్రెసిడెంట్ మాలేపాటి రవికుమార్, ఆర్యవైశ్య సంఘం మండల అద్యక్షులు దర్శి మాలకొండయ్య ఆద్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా టిడిపి టౌన్ అద్యక్షులు ఎంవి శేష య్య వ్యవహారించారు. మొదట వాసవిక్లబ్ వారు, ఆర్యవైశ్య సంఘం వారు జాతిపితి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా



వారు మాట్లాడుతు జాతిపిత మహాత్మగాంధీ అహింస అనే ఆయుదంతో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొని వచ్చారని వారు కొనియా డారు. జాతిపిత మహాత్మాగాంధీ నడిచిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని వారు పిలుపునిచ్చారు.ఈ ఆకార్య క్రమంలో భాగంగా వాసవీ క్లబ్ వారు చీపుర్లు చేతబూని గ్రామంలో వీధులు శుభ్రం చేశారు.ఈకార్యక్రమంలో వాసవీక్లబ్ నాయకులు తిరివీధి రాధాకృష్ణయ్య, సోల్లేటి ప్రభాకర్, కారంశెట్టి ప్రసాద్, గాదం శెట్టి శ్రీనివా సులు, దరిశి మాలకొండయ్య, దర్శి మాల్యాద్రి, బచ్చు సుబ్బయ్య, పాబోలు సుమన్, గాదంశెట్టి సుబ్బ య్య, బండారు వేణు, యిమ్మడిశెట్టి గోవిందయ్య, సురేంద్ర, సెక్రటరీ కనిగెల్పుల విశ్వనాద్, ట్రెజరర్ పమిడి కిషోర్,ఆర్యవైశ్యనాయకులు దుగ్గిశెట్టి హరినాద్,కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ.పలువురు ఆర్యవైశ్యులు పాల్గోన్నారు.

## గిరిధర్ రెడ్డికి అపూర్వ స్వాగతం పలికిన గ్రామస్తులు



**నెల్లూరు రూరల్, జనవరి 30, ప్రభాత వార్త :** తెలుగుదేశం పార్టీ రూరల్ నాయకులు కోటం రెడ్డి గిరిదర్ రెడ్డికి ములమూడి గ్రామ ప్రజలు 100 గుమ్మడికాయలతో దిష్టి తీసి, భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంట్లో ఆత్మీయత ఆప్యాయతతో సాదర స్వాగతం పలికారు. నెల్లూరు రూరల్ పరిధిలోని ములుమూడి గ్రామంలో 19వ రోజు గడపగడపకు కార్యక్రమం ప్రారంభమైంది. ములుమూడి గ్రామంలో కోటం రెడ్డి గిరిదర్ రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. ప్రతి ఇంటికి వెళ్లి స్థానిక ప్రజలను పలకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. నిత్యం ప్రజల కోసం ప్రజల్లోనే ఉంటామని తెలిపారు.

## విద్యుత్ దీపాలా నిర్వహణను క్రమం తప్పకుండా చేయాలి -కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్,జనవరి 30, ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలను అమర్చి వాటి నిర్వహణను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని స్థానిక 25 వ డివిజన్ బుజ బుజ నెల్లూరు పరిసర ప్రాంతాలలో కమిషనర్ గురువారం పర్యటించారు.ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని వీధుల్లో క్రమంతప్పకుండా డ్రైన్ కాలువల పూడికతీత, సిల్టు ఎత్తివేత పనులను చేపట్టాలని సూచించారు. డ్రైను కాలువలు, రోడ్ల నిర్మాణం అవసరమైన ప్రాంతాలను గుర్తించి ప్రణాళికలను సిద్ధం చేయాలని కమిషనర్ సూచించారు.వార్డు సచివాలయ భవనాలకు తప్పనిసరిగా బోర్డులు ఏర్పాటు చేసి సచివాలయం ద్వారా అందించే పౌర సేవలు, కార్యదర్శుల విధివిధానాలను ప్రదర్శించాలని కమిషనర్ ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి తొలి దశగా హెచ్చరించాలని పునరావృత్తం చేస్తే భారీ స్థాయిలో జరిమానాలు విధించాలని కమిషనర్ ఆదేశించారు. డివిజన్ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. అనంతరం స్థానిక డైకాస్ రోడ్డు వెంగళరావు నగర్ సమీపంలోని అన్న క్యాంటీన్ ను కమిషనర్ సందర్శించారు. క్యాంటీన్లో ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ప్రతి ఒక్కరికి టోకెన్ విధానం ద్వారానే ఆహారాన్ని అందించాలని నిర్వాహకులకు కమిషనర్ సూచించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఈ.ఈ. శేషగిరిరావు, వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్ మోహన్, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రేబాల సచివాలయాన్ని పరిశీలించిన జిల్లా అధికారి




**బుచ్చి జనవరి 30 ప్రభాతవార్త :** మండలంలోని రేబాల గ్రామ సచివాలయాన్ని జిల్లా పంచాయితీ అధికారి ఎల్ .శ్రీదర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దస్త్రాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఎస్‌డబ్ల్యు పిసి షెడ్‌ను కూడా పరిశీలించారు. సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఇఒపిఆర్‌డి నారాయణరెడ్డి, పంచాయితీ కార్యదర్శి సయ్యద్ జలీల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతిపిత మహాత్మాగాంధీకి నివాళులర్పించిన ఎమ్మెల్యే




**కందుకూరు, జనవరి 30, ప్రభాతవార్త :** జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం ఉదయం కందుకూరు నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యాగ్రహమే అయుధంగా అహింసా మార్గంలో పోరాడి కోట్లాది భారతీయులకు స్వేచ్ఛ స్వాతంత్ర్యం అందించిన మహనీయుడు జాతిపిత మహాత్మాగాంధీ అని తెలియజేస్తూ ఆయన దేశం కోసం చేసిన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఆర్యవైశ్య నాయకులు మురారిశెట్టి సుధీర్, గుర్రం అల్లూరయ్య, చెన్నకేశవులు, చీదేళ్ల వేణు, కాకుమాని ప్రవీణ్, పబ్బిశెట్టి రాజా, కోటా నరసింహం, కోటా కిషోర్, ఇస్కాల మధు, ఒరుగంటి శంకర్, తాత లక్ష్మీ నారాయణ, షేక్ రఫీ, కూనం నరేంద్ర, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డు షెడ్డును వినియోగించాలి



**లింగసముద్రం, జనవరి 30, ప్రభాతవార్త :** చిన్నపవని గ్రామంలో ఉన్న డంపింగ్ యార్డును మరమ్మత్తులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీఓ కట్ట శ్రీనివాసులు చెప్పారు. గురువారం ఆయన గ్రామంలోని డంపింగ్ యార్డు షెడ్డును పరిశీలించారు. షెడ్డు చుట్టూ ఉన్న జంగిల్ తొలగించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పంచాయ తీలోని చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేలా తగిన చర్యలు తీసుకోవాలని కార్యదర్శి సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సోంపల్లి మనోహర్, పంచాయతీ కార్యదర్శి రషీద్ ఉన్నారు.

## సత్యాన్వేషణ ధ్యాన యోగ ఆద్యాత్మిక క్షేత్రంలో రథసప్తమి వేడుకలు ప్రారంభం






**బుచ్చి జనవరి 30 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెంలోని వాసవీనగర్‌లోఉన్న సత్యాన్వేషణ ధ్యాన యోగ ఆద్యాత్మి కేంద్రంలో రథసప్తమి ( సూర్య జయంతి ) వేడుకలు గురువారం నుండి ప్రారంభం అయ్యాయి.ఈకార్యక్రమాలు ధ్యానయోగ గురువు గుబ్బా లక్ష్మీనారాయణనేతృత్వంలో ప్రారంభించారు.గురువారం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. ఆధ్యాత్మి బాస్కర అవార్డు గ్రహీత డాక్టర్ కోట రాధాకృష్ణమూర్తి గురువు ప్రవచనాలు చెప్పారు. ఈకార్యక్రమంలో పెద్దఎత్తున ధాన్యయోగ సాధుకులు పాల్గోని గురువు చెప్పే ప్రవచనాలు విన్నారు.

## ఉదయగిరి బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**కావలి, జనవరి30 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జిపై జరుగుతున్న పనులను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి గురువారం పరిశీలించారు. పనుల తీరును అడిగి తెలుసుకున్నారు. వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. బ్రిడ్జికి శాశ్విత ప్రాతిపదికన నిర్మాణపనులు చేయిస్తు న్న ఎమ్మెల్యేను వాహనదారులు ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యే చేస్తున్న సేవలను కొనియాడారు. ఆయన వెంట టిడిపి నేతలు పాల్గొన్నారు.

## గాంధేయమార్గంలో అందరం పయనిద్దాం : వైసిపినేతలు



**కావలి, జనవరి30 ప్రభాతవార్త :** మహాత్మాగాంధి చూపించిన అడుగుజాడల్లో అందరం పయనిద్దామని వైసిపినేతలు పిలుపునిచ్చారు. వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాలమేరకు గురువారం ప్రతాప్‌రెడ్డి నివాసప్రాంగణంలో గాంధీజి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. గాంధీజి గొప్పతనాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అద్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, వైసిపి జిల్లాఉపాద్యక్షుడు కనమర్లపూడి వెంకటనారాయణ, వైసిపినేతలు గంధం ప్రసన్నాంజనేయులు, దామిశెట్టి సుధీర్‌నాయుడు, కలికి శ్రీనివాసులురెడ్డి, అయ్యవారు కృష్ణారెడ్డి, పేరం వెంకటేశ్వర్లు, కలగయ్య, గుర్రం వెంకటేశ్వర్లు (జివి), దావులూరి మాల్యాద్రి, జంపాని రాఘవులు, నెల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి, పరుసు మాల్యాద్రి, చెన్ను ప్రసాదరెడ్డి, తోట శ్రీహరి, వేమిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి, వైసిపి నేతలు పాల్గొన్నారు.

## డిపిఓ కార్యాలయంలో మహాత్మకు ఘన నివాళులు



**నెల్లూరు, జనవరి 30, ప్రభాతవార్త – కలెక్టరేట్ :** జిల్లా పంచాయితీ కార్యాలయంలో మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా డిపిఓ శ్రీధర్ తమ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా పంచా యితీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలో వసతులు




**కందుకూరు, జనవరి 30, ప్రభాతవార్త :** ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా అన్ని వసతులు ఉన్నాయని విద్యార్థులు భాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం కందుకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 29వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఇదే కళాశాలలో నేను చదువుకున్నానని చెప్పుకోవడానికి చాలా గర్వంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అనేక కీలక నిర్ణయాలుతీసుకున్నారని దానిలో భాగంగానే ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ఏర్పాటు చేసి విద్యార్థులకు రుచికరమైన భోజన సదుపాయం కల్పించారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు భాగా చదివి మంచి ఉద్యోగాలు సంపాదించాలని ఎన్నో ఆశలు పెట్టుకుంటారని వారి ఆశలు నిరాశ చేయకుండా విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని విద్యార్థులకు ఎటువంటి అనుమానాలు ఉన్నవెంటనే అధ్యాపకులకు తెలియజేసి అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. మన ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఇంజనీరింగ్ , ఎంసెట్‌లో మంచి ర్యాంకులు సాధించి వివిధ హోదాల్లో ఉన్నారని మీరు కూడా భాగా చదివి మంచి ఉద్యోగాలు పొంది కందుకూరు నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కళాశాలలో భాగా చదువుకుని మంచి ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నగదు ప్రోత్సాహం అందించడం జరిగింది. కళాశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతికార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ షేక్ నాగూర్ వలి, పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య, ముచ్చు శ్రీనివాసరావు, వడ్డెళ్ళ రవిచంద్ర, షేక్ రఫీ, కూనం నరేంద్ర, షేక్ సలాం, ఇతర పార్టీ నాయకులు, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గాంధీజీ సేవలను గుర్తుకు చేసుకోండి



**నెల్లూరు, జనవరి 30, ప్రభాత వార్త–వైద్యం :** కుష్టు రోగులను దరికి చేర్చుకుని వారికి గాంధీజీ చేసిన సేవలు గుర్తు చేసుకుంటూ నేడు స్పర్శ కార్యక్రమం ద్వారా కుష్టు నివారణ కోసం వైద్యశాలలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వంగల సుజాత పేర్కొన్నారు. గురువారం స్థానిక దర్గామిట్టలోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో కుష్టు రోగులకు వైద్య సేవలందిస్తున్న టీహెచ్ వార్డులో గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి వైద్యశాఖాధికారులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ స్పర్శ అనే కార్యక్రమం ద్వారా ఫిబ్రవరి 13వ తేదీ వరకు పక్షం రోజుల పాటు కుష్టు నివారణపై వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మహిళా వాలంటీర్లు కుష్టు నివారణ కోసం కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేస్తారన్నారు. ఈ ప్రతిజ్ఞ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల్లో ప్రజలు పాల్గొని ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. అనంతరం గాంధీజీ స్ఫూర్తితో కుష్టు రహిత నెల్లూరు జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాసుపత్రి ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్ భాషా, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్ వలి, డీఎన్ఎంఓ డాక్టర్ సురేంద్ర, టీహెచ్ వార్డు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీత, డీఎప్టీ కోఆర్డినేటర్ సతీష్, ఫిజియోథెరపిస్టు నారాయణ, పీఎంఓ మల్లమ్మ, డీపీఎంలు సుబ్బయ్య, ఆచారి, రమణారెడ్డి, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.